4

# యేసు బాప్తిస్మం పొందారు

> ''ఆ దినములలో యేసు గలిలయలోని నజరేతునుండి వచ్చి యొర్దానులో యోహానుచేత బాప్తిస్మముపొందెను. వెంటనే ఆయన నీళ్లలోనుండి ఒడ్డునకు వచ్చుచుండగా ఆకాశము చీల్చబడుటయు, పరిశుద్ధాత్మ పావురమువలె తనమీదికి దిగివచ్చుటయు చూచెను. మరియు – నీవు నా ప్రియకుమారుడవు, నీయందు నేనానందించు చున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను'' (మార్కు 1:9–11).

యేసు పొందిన బాప్తిస్మం యోహాను బాప్తిస్మం (అపొ. 1:21, 22). ఆరోహణం తరువాత తన అనుచరులకు యివ్వబడిన బాప్తిస్మంతో యేసు పొందిన బాప్తిస్మాన్ని తబ్బిబ్బు చేయకూడదు. ఈ రెండవ బాప్తిస్మం ''యేసు బాప్తిస్మం'' లేక ''క్రొత్త నిబంధన బాప్తిస్మం'' అని సూచించ బడుతుంది.

## యేసు పొందిన బాప్తిస్మాన్ని గూర్చి కొందరు చెప్పినదేమి?

యోహాను యేసుకు యిచ్చిన బాప్తిస్మాన్ని గూర్చి మత సంబంధమైన ఒక గుంపు యిలా అంది, ''భూమిమీద తన తండ్రి జరిగించవలెనని అప్పగించిన ప్రత్యేకమైన పనికొరకును యెహోవాకు తన్ను తాను ప్రతిష్టించుకొనడానికిని అది సూచనగా ఉంది.''[1]

రెండవ దృక్పథం ఏమంటే, ''యేసు బాప్తిస్మం పొందినట్టు మనం బాప్తిస్మం పొందాలి,'' మరియు ''మేలైనదానికి లేక దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి యేసు బాప్తిస్మం పొందారు.''[2] యేసు బాప్తిస్మం పొందడంలో ఉండే ఒకే ఉద్దేశం దేవునికి విధేయత చూపించడమేననే భావానికి ఈ దృక్పథం చేరుకొంటుంది. యోహానుచే యేసుయొక్క బాప్తిస్మం మన బాప్తిస్మంతో సమాంతరంగా ఉందనేది తరువాత చెప్పబడింది; దీనినుండి ఈ క్రింది ముగింపు తీయబడింది:

> దానిని అలా నిలువనిచ్చి, రక్షకుని ఏ ఉద్దేశం నడిపించిందో అదే ఉద్దేశంతో అతడు ముంచబడినప్పుడు, క్షమాపణ విషయం అతనికి తెలియకపోయినా, అతని బాప్తిస్మం లేఖనానుసారమైందే అని చూపవచ్చు.[3]

బాప్తిస్మం యొక్క ఉద్దేశం ఒకనికి చెప్పబడకపోయినా, లేక బాప్తిస్మం యొక్క ఉద్దేశం తెలియదన్నా సరే – దేవునికి లోబడడానికి ఒకడు బాప్తిస్మం పొందినంతవరకు వాగ్దానం చేయబడిన లాభాలు అతడు పొందుతాడు అనేదాన్ని రుజువు చేయడానికి ఈ విధంగా యేసు పొందిన బాప్తిస్మాన్ని ఉపయోగిస్తారు.

తాను బాప్తిస్మం పొందినప్పుడు తన బాప్తిస్మం యొక్క ఉద్దేశాన్ని యేసు గ్రహించకుండా పోలేదు. అన్ని విధాలా ఆయన మనకు మాదిరియైయున్నప్పుడు, మనం బాప్తిస్మం పొందినప్పుడు

మనకు ఏ గ్రహింపు కొదువైయుండకూడదు. యేసు పొందిన బాప్తిస్మానికి, మనం పొందే బాప్తిస్మానికి ఉద్దేశంలో వ్యత్యాసముంది.

మూడవ దృక్పథం ఏమంటే, తాను బాప్తిస్మం పొందినప్పుడు యేసు పాప రహితుడు గనుక బాప్తిస్మం పొందాలంటే ప్రతి ఒక్కడు పాపరహితుడైయుండాలి. అది అలా అయ్యున్నట్టయితే రక్షణకు బాప్తిస్మం అనవసరమే. రక్షింపబడడానికి ఒకడు బాప్తిస్మం పొందవలసియుండగా, విశ్వాసంవలన మాత్రమే అనే బోధ నిరాకరించ బడుతుందని ఈ దృక్పథంగలవారు భావిస్తారు.

యేసు బాప్తిస్మం పొందిన దానిపట్ల ఈ మూడు పంథాల్లోని ఆలోచనలు ఆయన బాప్తిస్మానికి లోబడడం వ్యర్థమైన కర్మకాండగా భావిస్తారు. యేసు ఎల్లప్పుడు దేవుని చిత్తాన్ని అంగీకరించి, ఆయన చిత్తాన్ని జరిగించడానికి వచ్చినందున (యోహాను 6:38; హెబ్రీ. 10:7), దేవుని యొక్క సేవకు ఆయన సాదృశ్యరూపంగా తన్ను తాను ప్రతిష్ఠించుకునే అవసరముండదని మొదటి దృక్పథాన్ని చెప్పేవారు అంగీకరించి తీరవలసిందే. ఆయన భూమిమీదికి రావడంలో తన్ను తాను దేవుని చిత్తానికి ముందుగానే అర్పించుకొన్నారు. దేవుని చిత్తానికి తన్ను తాను అర్పించుకొన్నట్టు ఆయన భూమిమీదికి రావడమే చాలినంత రుజువుగా ఉంది. యోహానుచే యేసు బాప్తిస్మం పొందడం మనుష్యుల కొరకు కాదు ఎందుకంటే కొద్దిమంది ప్రజలే ఆయన బాప్తిస్మం పొందడాన్ని తిలకించారు. ఆయన బాప్తిస్మం పొందడంలో ఇమిడియున్నది యిదే అయియున్నట్టయితే, ఆయన కార్యము వ్యర్థ ఆచారమైయుంటుంది.

రెండవ దృక్పథం విషయంలో అడగవలసిన ప్రశ్న యిదే: ఏదంటే, క్షమింపబడవలసిన పాపం ఏది యేసుకు లేనందునను, ఆయన నశించిపోనందున నశించిన పాపులకు మాదిరిగా యేసు బాప్తిస్మం ఎలా ఉండగలదు? విధేయతకు ఆయన బాప్తిస్మం మంచి ఉదాహరణయైయున్నా, పాపక్షమాపణను పొందడానికి కనుగొనే ఉదాహరణకు మరొక చోట చూడవలసియుంటుంది (అపొ. 2:38–41; 22:16). క్షమాపణ అనేది కేవలం బాప్తిస్మంకంటే ఎక్కువైనదిగా చేర్చబడింది.

దేవుని నీతియావత్తు నెరవేర్చి, విధేయత యొక్క పరిపూర్ణమైన రికార్డు నిలపడానికి గాను యేసు యొక్క బాప్తిస్మం ప్రయాస పడుతుంది. మరోవైపు పాపికి బాప్తిస్మమనేది క్షమాపణ పొందడానికిని, అపరిపూర్ణమైన రికార్డును దిద్దడానికిని దేవునితో సరియైన బాంధవ్యాన్ని కలిగియుండడానికిని ఉద్దేశించబడింది.

యేసు మరియు యోహాను బాప్తిస్మము పొందవచ్చిన వారును, దేవునికి విధేయులగుటకే వచ్చారు, కానీ వారు సంపూర్ణంగా రెండు వేరైన ఉద్దేశాలకొరకు వచ్చారు. తిరిగి వెళ్లేటప్పుడు తన బంధువుతో పోనిస్తాడని మా అన్నయైనగ్లెన్ మా తల్లిదండ్రులకు లోబడడానికి కొయ్యను మోసికొని పోయాడు, కొయ్యలు మోసికొని వెళ్లుతూ నేను లోబడింది నా స్నేహితునితో వేటకు వెళ్లడానికి. తల్లిదండ్రులకు నేను విధేయుడనయ్యేలా మాదిరి చూపడానికి గ్లెన్ కొయ్యను మోసికొని వెళ్లియుండవచ్చు, అయితే మా ఉద్దేశాలు రెండూ ఒకటే కాదు. అలాగే విధేయతకు మాదిరిగా యేసు బాప్తిస్మము పొందియుండవచ్చు, అయినా పాపులు ఏ ఉద్దేశంతో లోబడ్డారో అదే ఉద్దేశంతో ఆయన లోబడి యుండనక్కరలేదు.

మూడవ దృక్పథం క్రొత్త నిబంధన బాప్తిస్మాన్ని కూడ అర్థరహితమైన కర్మకాండగా చేస్తుంది. బాప్తిస్మం అనేది మానవ పాపం కొరకైన దేవుని ఆవశ్యకత కానట్టయితే, దానికి సహజమైన లేక ఆత్మ సంబంధమైన విలువ లేకపోయినట్టయితే, అది అర్థ రహితమైన కార్యకలాపమే. నీటిలో

నిర్వహించిన బాహ్యపు చర్యకంటే బాప్తిస్మంలో చూపే విధేయతకు ఎక్కువ అర్థముండాలని దేవుడు ఖచ్చితంగా ఉద్దేశిస్తున్నారు.

## యోహాను పరిచర్యలో యేసు బాప్తిస్మం అర్థమైంది

యేసు పొందిన బాప్తిస్మాన్ని యోహాను పరిచర్య సందర్భంతో అర్థం చేసుకోవాలి. ఒకడు ఈ సందర్భానికి వెలుపల దీని అర్థాన్ని చూడగోరినట్టయితే, అతని ప్రయాస కలతతో కూడినదైయుంటుంది, తప్పు త్రోవను పట్టిస్తుంది, అపార్థం చేయబడుతుంది.

''యోహాను బాప్తిస్మాన్ని ప్రకటించాడు'' అనే పాఠంలో పరిచయం చేసినట్టుగానే (మత్తయి 3:1-3; లూకా 3:1-9; యోహాను 1:15-34 చూడు), రానైయున్న మెస్సీయా కొరకు జనులను సిద్ధపరచడమే యోహాను పరిచర్య యొక్క ఉద్దేశమైయుంది (యోహాను 1:6-8). ఈ సిద్ధపాటులో (1) త్వరలోనే స్థాపించబోయే రాజ్యాన్ని ప్రకటించడం, (2) రాజైన మెస్సీయాను అంగీకరించేలా జనులను సిద్ధపరచడం, (3) జనులను మారుమనస్సు పొందేలా చేయడం, (4) జనులను బాప్తిస్మంలో సమర్పించుకొనేలా చేయడమనేది వారు మారుమనస్సు పొంది, త్వరలో ప్రత్యక్షం కానైయున్న మెస్సీయాను విశ్వసించడానికి యిష్టపడుతున్నారనడానికి రుజువైయుంది.

## యేసు పొందిన బాప్తిస్మానికి కారణం, ఉద్దేశం

కారణం, ఉద్దేశం అనేవి వ్యత్యాసాలు కావచ్చు. తండ్రి తన కుమారునికి స్నానం చేసి తలను దువ్వుకోమని చెప్పవచ్చు. దాని ఉద్దేశం కుమారుడు చక్కగా కన్పించడానికి కావచ్చు, దానికి కారణం తన కుమారుడు పెండ్లి చేసుకునే అమ్మాయికి ఆకర్షనీయంగా కన్పించాలని కూడ కావచ్చు. ఈ సందర్భంలో కారణం, ఉద్దేశం అనేవి వేరుగా ఉంటాయి.

అది నిర్దిష్టంగా చెప్పబడకపోయినా, దేవునికి విధేయత చూపించాలనే కోరిక యేసును బాప్తిస్మం పొందేలా చేయవచ్చు. యోహాను బాప్తిస్మాన్ని పొందవచ్చిన వారందరూ దేవునికి విధేయత చూపాలి అన్న కారణాన్నే కలిగియుండవచ్చు. కాని వారి ఉద్దేశం యేసుకు కలిగిన ఉద్దేశంలాంటిదై యుండదు. నీతి యావత్తు నెరవేర్చడానికి ఆయన వచ్చియుండగా, వారైతే పాపక్షమాపణ ద్వారా నీతిమంతులు అవడానికి వచ్చారు. యేసూ, యోహాను శిష్యులూ ఒకే ఉద్దేశంతో వచ్చియున్నట్టయితే (1) యేసు పాపియైయుండి తమ పాపాలను ఒప్పుకొంటూ, పాపాల విషయమై మారుమనస్సు పొందుతూ, బాప్తిస్మం పొంది పాపక్షమాపణ పొందడం ద్వారా నీతిమంతుడు కాడానికి విధేయత చూపియుండాలి (లేక) (2) పాపం యొక్క దోషం లేకుండా బాప్తిస్మానికి ఒకడు రావాలి. ఎందుకంటే, బాప్తిస్మం పొందినప్పుడు యేసు పాపరహితుడు, మొదటి ముగింపు యేసును పాపిగా చేయడం ద్వారా లేఖనానికి పరస్పర విరుద్ధంగా ఉంది (హెబ్రీ. 4:15). రెండవది బాప్తిస్మం అనేది పాపక్షమాపణ నిమిత్తము అనే లేఖనాలకు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి (అపొ. 2:38; 22:16).

నీతియావత్తు నెరవేర్చే ఆవశ్యకత కొరకే తాను బాప్తిస్మం పొందియున్నట్టు యేసు చెప్పియున్నట్టయితే, అదే కారణాన్నిబట్టి తాను బాప్తిస్మం పొందినట్టు నిర్ణయానికి రావచ్చు. ఏదియెలాగున్నా, నీతియావత్తు నెరవేర్చడానికి తాను బాప్తిస్మం పొందాలని యేసు చెప్పారు. అదే

కారణాన్నిబట్టి ప్రతివాడు బాప్తిస్మం పొందాలనేది మినహాయించబడింది. తాను యేసుచేత బాప్తిస్మం పొందవలసినవాడైయున్నట్టు చెప్పుకున్న యోహాను సయితం (మత్తయి 3:14), నీతియావత్తు నెరవేర్చు స్థితి యొక్క సమీపానికి రాలేదు (రోమా 3:10). యేసు మాత్రమే ప్రత్యేకమైనవారై ఉండి నీతియావత్తు నెరవేర్చడానికి బాప్తిస్మం పొందగలరు.

బాప్తిస్మం పొందడం ద్వారా యేసు యొక్క సాక్ష్యాన్ని, బాప్తిస్మం పొంద నిరాకరించేవారు త్రోసివేయడం మాత్రమే గాక నీతిని జరిగించాలనే దేవుని యొక్క ఆవశ్యకతను నిరాకరిస్తారు. పేదలకు సహాయం చేయడం, మేలు చేయడంవలెనే బాప్తిస్మం అనేది మానవ నీతిక్రియ కాదు (తీతు 3:5), అది పరలోకంనుండి, దేవుని యొద్దనుండి కలిగింది; గనుక, దానికి తన్ను తాను లోబరచుకొన్నప్పుడు నీతి జరిగించాలనే దేవుని యొక్క అవసరతను అది నెరవేర్చుతుంది. యేసు బాప్తిస్మం పొందడంలో యిది ఒక కారణమైయుంది, ఎందుకంటే బాప్తిస్మమనేది దేవుని యొక్క నీతిపరమైన ఆవశ్యకతల్లో ఒకటైయుంటుంది.

## యోహాను బాప్తిస్మం పరలోకంనుండి కలిగింది

యేసు యోహానుచేత బాప్తిస్మం పొందినప్పుడు యోహాను బాప్తిస్మం పరలోకంనుండి కలిగిందనిన్నీ (లూకా 20:1-8), బాప్తిస్మమివ్వడానికి దేవుడు యోహానును పంపారనిన్నీ ఆయన గుర్తించారు. తాను చేస్తున్న క్రియలు ఏ అధికారంవలన చేస్తున్నాడని ప్రధాన యాజకులును, పెద్దలును ఆయనను అడిగినప్పుడు వారికి సమాధానం యిస్తూ, ''యోహాను ఇచ్చిన బాప్తిస్మము పరలోకంనుండి కలిగినదా మనుష్యులనుండి కలిగినదా?'' అని యేసు అడిగారు (లూకా 20:4).

ప్రశ్నలో గుప్తమైయున్నది స్పష్టంగా ఉంది. యోహాను బాప్తిస్మం పరలోకంనుండి కలిగినదని వారు చెప్పినట్టయితే, వారు యోహాను బాప్తిస్మాన్ని పొంది యేసు మెస్సీయా అని అతడు యిచ్చిన సాక్ష్యాన్ని వారు అంగీకరించి ఉండేవారే. యోహాను బాప్తిస్మం పొందకున్నందువలన అది మనుష్యులవలన కలిగిందని వారు తలంచారు; గనుక, యేసును గూర్చి అతడిచ్చిన సాక్ష్యాన్ని వారు అంగీకరించలేదు.

ఈ నాయకులు యోహానుచేత బాప్తిస్మం పొందక తమ విషయమై దేవుని సంకల్పాన్ని నిరాకరించారు. ''దేవునిచే న్యాయమని'' యెంచబడిన బాప్తిస్మాన్ని అంగీకరించినవారైతే, బాప్తిస్మం పొందడం ద్వారా దేవుని మార్గం సరియైనదని అంగీకరించారు (లూకా 7:30).

ఈ సందర్భంలో, యేసు యోహానుచేత బాప్తిస్మం పొందవచ్చారు. తాను యోహాను కంటే గొప్పవాడని అతడిచ్చిన సాక్ష్యాన్ని గూర్చి ఆయన ఎరుగును (మార్కు 1:7), బాప్తిస్మం పొందడం ద్వారా ప్రభువైన యేసు యోహాను యొక్క పనిని అంగీకరించడమే గాక అతని వర్తమానం యొక్క విలువకు ఆయన సాక్షిగా నిలిచారు. యోహానుచేత యేసు బాప్తిస్మం పొంద నిరాకరించి ఉన్నట్టయితే, యోహాను మోసగాడని ఆయన సూచించియుండేవారే. తన బాప్తిస్మం ద్వారా, యోహాను తన్నుగూర్చి ఏమని చెప్పాడో అదంతా నిజమైనట్టున్నూ (మత్తయి 3:3; యోహాను 1:23), తాను మెస్సీయా అని అతడు చెప్పినది సత్యమైనట్టున్నూ యేసు సాక్ష్యమిచ్చినట్టే (యోహాను 1:15).

బాప్తిస్మం యివ్వడానికి తాను పంపబడ్డాడనియు, తన బాప్తిస్మం ద్వారా మెస్సీయా తనకు

బయలుపరచబడతాడనియు, తన బాప్తిస్మం పరలోకంనుండి కలిగిందనియు యోహాను గుర్తించాడు (యోహాను 1:33, 34). యోహాను దేవుని యొక్క నిజమైన ప్రవక్తయని చెప్పి యేసు అతనిచేత బాప్తిస్మం పొంద వచ్చిందేగాక తాను యోహానునకు బయలుపరచబడనైయున్నట్టున్నూ ఆయన దేవుని కుమారుడని ఇశ్రాయేలీయులకు అతడు సాక్ష్యమిచ్చునట్టున్నూ యేసు అతనిచే బాప్తిస్మం పొందవచ్చారు (యోహాను 1:31–33). ఈ కారణాన యేసు బాప్తిస్మం పొందడానికి రావడంలో గొప్ప ప్రాముఖ్యతను చూపవలసియుంది.

ఇశ్రాయేలీయులకు ప్రత్యక్షపరచడానికి యేసు బాప్తిస్మం పొందారు (యోహాను 1:31). అయితే ఇశ్రాయేలీయులలో కొందరు మాత్రమే ఆయన బాప్తిస్మం పొందగా చూశారు. ప్రాథమికంగా ఆయన బాప్తిస్మాన్ని చూచింది యోహానే. ఇది ప్రాముఖ్యమైంది, ఎందుకంటే బాప్తిస్మం తరువాత పరిశుద్ధాత్మ యేసు మీదికి వచ్చినప్పుడు యేసే మెస్సీయా అని దేవుడు యిచ్చిన సాక్ష్యానికి యోహాను సాక్షిగా ఉన్నాడు. యేసు యొక్క బాప్తిస్మానికి తక్షణమే జరిగిన కార్యం, యేసుపై పరిశుద్ధాత్మను పంపడం ద్వారా దేవుడు యోహానుకు సాక్ష్యమిచ్చారు. యేసు దేవుని కుమారుడని యోహాను ఇశ్రాయేలీయులకు సాక్ష్యమివ్వడమే దీనియొక్క ఫలితార్థం (యోహాను 1:32–34).

## నీటి బాప్తిస్మం యొక్క ప్రాముఖ్యత

యేసే మెస్సీయా, దేవుని కుమారుడని సాక్ష్యమివ్వడానికి యోహాను యేసుకు నీటి బాప్తిస్మం యివ్వడంలో నీటి బాప్తిస్మం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడాన్ని దేవుడు కోరియుండవచ్చు (యోహాను 1:31–34), ఆ బాప్తిస్మం వెనువెంట, ''ఈయనే నా ప్రియ కుమారుడు ఈయనయందు నేనానందించు చున్నాను'' అనే ప్రతిపాదనను ఆయన చేశారు (మత్తయి 3:17). యేసు కూడ నీటి బాప్తిస్మం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పియుండవచ్చు. తాను పాపరహితు డైనా (హెబ్రీ. 4:15), యోహాను యొక్క బాప్తిస్మంతో కలిసియున్నా, పాపక్షమాపణ ఆయనకు అవసరం లేకున్నా , ఆయన బాప్తిస్మం పొందారు.

## యేసు మాత్రం మినహాయింపు

యేసు మాత్రమే మినహాయించబడ్డారు. యోహాను యొక్క బాప్తిస్మం పొందవచ్చిన ప్రతి ఒక్కనికి పాపక్షమాపణ అవసరం. వారు పాపాలు ఒప్పుకోవాలి వాటి విషయమై మారుమనస్సు పొంది తరువాత బాప్తిస్మం పొందాలి (మత్తయి 3:7, 8). వారు జీవితాల్లో కొన్ని మార్పులు చేసుకొని (లూకా 3:10–14), రాబోయే మెస్సీయాయందు నమ్మికయుంచాలని ఉపదేశింప బడ్డారు (అపొ. 19:4). యోహాను బాప్తిస్మంతో జతకూడిన ఈ ఉద్దేశాలన్నీ యేసుకు వర్తించవు, అయితే యోహాను బాప్తిస్మంతో జతకూడిన యితర ఆలోచనలు (రాబోయే రాజ్యం, రాబోయే మెస్సీయా అనేవి) ఆయనకు వర్తిస్తాయి. యోహాను బాప్తిస్మంలో గుప్తమైయున్నవన్నీ యేసుకు వర్తించకపోయినా, కొన్ని మాత్రము వర్తిస్తాయి; గనుక, యోహాను బాప్తిస్మానికి యేసు లోబడ్డారు.

పట్టణంలో ఉన్న ప్రతి కారు ప్రతి మంగళవారం రోజున కడుగబడాలని తన తండ్రి జారీ

చేసిన చట్టాన్ని ఎరిగిన ఒక మేయర్ కుమారుని చర్యలకు యేసు బాప్తిస్మాన్ని పోల్చవచ్చు. మచ్చగాని, మురికి చుక్కగాని లేని ఒక క్రొత్త కారును సోమవారం అతని కుమారుడు కొన్నాడు. మేయర్గా తన తండ్రి జారీ చేసిన చట్టానికి గౌరవం చూపడానికి గాను తన కారు కడుగబడనవసరం లేకపోయినా మంగళవారం నాడు అతని కుమారుడు కారును కడిగాడు. యిలా చేయడం ద్వారా, తన తండ్రికి ఆ కుమారుడు గౌరవాన్ని ప్రదర్శించడం మాత్రమే గాక తన తండ్రి యొక్క అధికారానికిని అతడు జారీ చేసిన చట్టానికిని గల ప్రాముఖ్యతను అతడు కనుపరచాడు. ఇతరులు చూపిన విధేయతవలె తానును ఆ చట్టానికి విధేయత చూపినప్పటికిని ఈ సందర్భంలో అతని ఉద్దేశం మాత్రం వేరైనదే. తన తండ్రి గౌరవార్థం అతడు దాన్ని చేశాడు. తక్కినవారైతే అతని తండ్రి గౌరవం కొరకు మాత్రమే కాదుగాని తమ కారులను శుభ్రం చేసుకోడానికి వారు ఆ పనిని జరిగించియుంటారు. అదేవిధంగా, పవిత్రుడైన దేవుని కుమారుడు తన తండ్రిని గౌరవించుతూ బాప్తిస్మం పొంది, యోహాను ద్వారా ఆయన తండ్రి ఆజ్ఞాపించిన యోహాను యొక్క పనికిని, అతని బాప్తిస్మానికిని యేసు సాక్ష్యమిచ్చారు.

యేసుకు పాపాలు లేవు, గనుక పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు పొందవలసిన అవసరత ఆయనకు లేదు. దేవునిచే బోధింపబడి (యోహాను 6:45), విశ్వసించి (యోహాను 3:16), మారుమనస్సు పొంది (అపొ. 17:30), ఒప్పుకొని (రోమా 10:10). పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందేవారికి అంటే రక్షింపబడడానికి ఏమి చేయాలి అనే దానికి ఆయన మాదిరియైయుండలేదు (మార్కు 16:16; అపొ. 2:38; 22:16; 1 పేతురు 3:21). ఇవన్నీ పాపులకు అవసరం, నిర్దోషికి కాదు: వారు నిర్దోషులైన పసిబిడ్డలేగాని లేక నిర్దోషియైన దేవుని కుమారుడేగాని. మనం చేయవలసిందంతా యేసు యొక్క మాదిరిలో చేర్చబడియుంటే, పై చెప్పిన సంగతులను ఆయన చేయలేదు గనుక మనమును చేయనవసరం ఉండదు. ఏది ఎలాగున్నా, మనం పాపులం. మన పాపాల విషయమై క్షమింపబడేలా ఆయన చేయనవసరం లేకపోయినా వాటిని మనం చేసి తీరాలి. ఆయన చేసినది మనం చేయవలసిన దానిలో చేర్చబడకపోయినట్టయితే, మన పాపాలనుండి క్షమింపబడడానికి మనం చేయవలసిన దానంతటిలో ఆయన మాదిరియై ఉండనేరడు.

పన్నెండేండ్ల ప్రాయంలో యేసు దేవాలయంలో బోధించిన కారణాన ఆ పన్నెండేండ్ల వయస్సునే కొందరు పిల్లలకు బాప్తిస్మం యిచ్చే వయస్సుగా ఎన్నుకున్నారు. ''ఆయన అన్ని విషయాల్లో మనకు మాదిరి అనేది సత్యమే.''[4] యేసు అన్ని విషయాల్లో మనకు మాదిరియైతే, పిల్లలు దేవుని కొరకైన పరిచర్యను పన్నెండేండ్ల వయస్సులోనే ప్రారంభించేలా చూడాలి. అయితే బాప్తిస్మం పొంది ఆ తరువాత దేవుని కొరకైన పరిచర్యను ప్రారంభించడానికి ముప్పది యేండ్ల వయస్సువరకు యేసు వేచియున్నారు (లూకా 3:21–23). ఈ క్రియ దేవుని యెడల కనుపరచే విధేయతకు మాదిరియై ఉంటే, ఒకడు బాప్తిస్మం పొంది దేవుని కొరకు పరిచర్య చేయడానికి ముప్పది యేండ్ల వయస్సులోనే అనేది సరియైన మాదిరియేనా?

## ముగింపు

బాప్తిస్మం పొందడం ద్వారా యేసు తాను మెస్సీయానని యోహానుకు ప్రత్యక్షపరచుకున్నారు

మరియు యోహాను నిజమైన దేవుని ప్రవక్త అని ఆయన సాక్ష్యమిచ్చారు. ఏ మనుష్యుడు ఎన్నడూ నెరవేర్చలేని ఒక సాధనను అంటే, నీతియావత్తు జరిగించబడాలనే దేవుని ఆవశ్యకతను నిలుపడానికే, ఆయన ఆ నీతి క్రియకు విధేయతను చూప ముందుకు వెళ్ళారు. నీతియావత్తు జరిగించేలా యేసు మాత్రమే జీవించారు. మనుష్యుడు పాపియై నీతిని నెరవేర్చలేనప్పుడు, నీతిమంతులు కావడానికి బాప్తిస్మాన్ని సమీపించాలి. యేసు యొక్క బాప్తిస్మం విధేయతకు మాదిరియైందే, గాని అది పాపక్షమాపణను, రక్షణను పొందడానికి మాదిరి కాదు.

యోహాను బాప్తిస్మంలో ఉన్నదంతా ప్రభువైన యేసుకు వర్తించకపోయినా, యోహాను బాప్తిస్మంలో ఉన్న విధేయత సూత్రం మాత్రం ఆయనకు వర్తించింది. కాబట్టి, ఆయనకు వర్తించిన వాటిని నెరవేర్చడానికి యేసు బాప్తిస్మం పొందారు; ఈ విధంగా దేవుని నీతి ఆవశ్యకతను నెరవేర్చడంలో ఆయన కొనసాగారు.

---

సూచనలు

[1]*Let Your Kingdom Come* (n.p.: Watchtower Bible and Tract Society of Pennsylvania, 1981), 69. [2]Jimmy Allen, *Rebaptism*? (West Monroe, La.: Howard Publishing Co., 1991), 46. [3]Ibid., 48. [4]Ibid.